ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
గురువారం 7 మార్చి 2024







కొండకు ప్రభను తీసుకొస్తున్న మహిళలు, చిన్నారులు





కొండంత సంబరం

- ఘనంగా శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ళ ఉత్సవాలు ప్రారంభం
- స్వామికి విశేష అభిషేకాలు
- కొండకు తరలివచ్చిన చిట్టి పొట్టి ప్రభలు
- గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 6: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ళ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలి వచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు, మహిళలు కాలినడకన కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. భక్తులు గిరి ప్రదక్షణ చేశారు. కొండ దిగువున సోపాన మార్గం వద్ద ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వేలాది మంది భక్తులు మెట్ల పూజ చేశారు. సోపాన మార్గంలో ఉన్న ఆనందవల్లి ఆలయంలో కూడా పూజలు చేశారు. ధ్యాన శివుడు, నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు.






శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు

ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ నెలకొంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. స్వామి దర్శనం అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. కొండ దిగువున తల నీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ షిరిడీ సాయి అన్నపూర్ణ అన్నదాన కమిటీ, ఆర్యవైశ్య సంఘం సేవా సంస్థల ఆధ్వర్యంలో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

రేపే ప్రభల పండుగ

- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులకు పైగా..
- తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం

తిరునాళ్ళకు నెల రోజుల ముందు నుంచే గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల సందడి మొదలవుతుంది. ఊరంతా కలసికట్టుగా ప్రభ పనుల్లో పాల్గొంటారు. తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తున్నాయి. ఒక్కో ప్రభ నిర్మాణ వ్యయం రూ.25లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఉంటుంది. ప్రభల నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గతంలో ఎడ్లతో ప్రభను తరలించేవారు. నేడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పనివారు వెంట నడుస్తారు. ప్రభకు ఏర్పాటు చేసే లైట్లు, తోరణాలు అమరికలో కూడా ప్రత్యేకత సంతరించుకుంటుంది. రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు ఇలా వివిధ రకాలుగా ఉంటాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలి వస్తాయి. ప్రభలపై తిరునాళ్ళలో సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. మహాశివరాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తిరునాళ్ళ వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకించి పోతారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి కాకాని ఒక్కో భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం గ్రామం నుంచి 6 ప్రభలు, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి.



గురవాయపాలెం గ్రామంలో తిరునాళ్ళకు నిర్మించిన విద్యుత్ ప్రభ



కొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్

8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హెటీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తిరునాళ్ల రోజున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు శనివారం ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. గతంలో రెండుగంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఒకే సారి ప్రభలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో సమయంను పెంచడం జరిగిందన్నారు.

ఘాట్ రోడ్డులో నడకకు అనుమతి లేదు

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుంటున్నారు. దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈసారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తుల నడకను అనుమతి లేదని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రకటించారు. భక్తులు సోపాన మార్గం గుండా కొండపైకి రావాలని కోరారు.

తిరునాళ్లకు 528 బస్సులు

తిరునాళ్లకు ఆర్టీసీ 528 బస్సుల ను ఏర్పాటు చేస్తున్నట్లు నరసరా వుపేట డీఎం బత్తుల వీరాస్వామి బుధవారం తెలిపారు. నరసరావు పేట నుంచి 265, చిలకలూరి పేట నుంచి 100, అద్దంకి 30, ఒంగోలు 45, చీరాల 45, వినుకొండ 43 బస్సులు ఏర్పాటు చేస్తు న్నట్లు వివరించారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన శేషాద్రి బస్సులు నిర్వహిస్తామన్నారు. వీఐపీల కోసం 20 సూపర లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నరసరావు పేట నుంచి కొండ దిగువ కు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండ పైకి టిక్కెట్ రూ.25, చిలకలూ రిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ. 120,చీరాల రూ.100, అద్దంకి టిక్కె ట్ ధర రూ.105 అని తెలిపారు.



విద్యుత్ వెలుగుల్లో అమరావతి అమరేశ్వరస్వామి ఆలయ గోపురం

క్వారీ తిరునాళ్లకు.. విస్తృత ఏర్పాట్లు

- ఆలయం వద్ద నిర్మించిన చలువ పందిళ్లు
- నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రభలు

చేబ్రోలు, మార్చి6: గుంటూరు జిల్లాలోనే మహిమాన్విత శైవక్షేత్రంగా వెలుగొందుతున్న క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు నారాకోడూరు ప్రధాన రహదారిని అనుకోని ఉన్న ఈ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి అశేష జనవాహిని శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలిరానున్నారు. ఇప్పటికే భక్తుల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లలో నిమ్మగ్నమయ్యాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయం వద్ద విశాలమైన ప్రాంగణంలో ఉండటంతో ఓ వైపు వినోదం, ఆహ్లాదం అందించే జెయింట్ వీల్ వంటి వివిధ క్రీడా సముదాయాలను నిర్మించారు.ఈ ఏడాది నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్దపల్లి తదితర గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లకు రానున్నాయి.



క్వారీ దేవాలయం ముందు విద్యుత్ అలంకరణలు

గోవాడ ముస్తాబు

అమృతలూరు: మహాశివ రాత్రి ఉత్సవాలకు గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. రంగులు వేయడంతో పాటు, చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణతో ఆలయం నూతన శోభ సంతరించుకుంది. స్వామి వారిని భక్తులు సులవుగా దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నారు. తొలి రోజున జరిగే పశువుల ప్రదక్షిణకు కూడా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ఇబ్బందులు రాకుండా పెద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలికంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను సిద్ధం చేశారు. పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చేతి పంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. లక్షల సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఈవో అశోక్‌రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామి వారి దర్శనానికి ప్రత్యేక దర్శనం రూ.10, శీఘ్రదర్శనం రూ.20, లఘుదర్శనం రూ.50, వీఐపీ దర్శనం రూ.100లతో పాటు 24 గంటలు ఉచిత దర్శనం కొనసాగుతుందన్నారు. ప్రత్యేక అభిషేకాలు జరగనున్నట్లు చెప్పారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ విద్యుత్ ప్రభను గురువారం సాయంత్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గృహోపకరణాలు, బొమ్మలు, చెరుకు విక్రయదారులు స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు.



ముస్తాబైన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం

ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి, సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.



సిద్ధమైన క్యూలైన్లు

అంబటి రాంబాబుకూ.. స్థానభ్రంశం

- చిలకలూరిపేటకు మంత్రి బదిలీ
- మోదుగుల సత్తెనపల్లికి
- వైసీపీలో తీవ్రస్థాయిలో చర్చ
- త్వరలో విడుదలయ్యే జాబితాలో వీరి పేర్లు ఉండొచ్చు..?

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల అభ్యర్థుల జాబితా అంతా సిద్ధమైపోయిం దని ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి వారం కిత్రం ప్రకటించారు. అయినా ఇంకా మార్పులు జరుగుతూనే ఉన్నాయి. కీలక నేతల స్థానాలనూ మారుస్తున్నారు. మంత్రి అంబటి రాంబాబుకూ స్థాన భ్రంశం జరిగినట్లుగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సత్తెనపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి అంబటి రాంబాబును చిలకలూరిపేటకు బదిలీ చేసినట్లుగా పార్టీవర్గాలు చెబుతున్నాయి. సత్తెనపల్లి సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డిని నియమించినట్లు చెబుతున్నారు. సిట్టింగ్ స్థానంలో మంత్రి రజిని కొన సాగితే ప్రతికూల ఫలితాలు వస్తాయని సర్వే ఫలి తాలు రావడంతో.. ఆమెను చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమకు గతంలో మార్చేశారు. ఆ తర్వాత స్థానికుడైన మల్లెల రాజేష్‌నాయుడు సమన్వయ కర్తగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే తాజా గా ఈ స్థానంపై పలు సర్వేలు చేశాక మంత్రి అంబటి రాంబాబును బరిలోకి దింపాలన్న యోచనకు జగన్ వచ్చారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. మోదుగుల వేణుగోపాలరెడ్డిని సత్తెనపల్లె నుంచి బరిలోకి దింపాలని జగన్ భావిం చారంటున్నారు. వీరిద్దరి పేర్లతో కూడిన జాబితా అధికారికంగా వెల్లడి కానప్పటికీ అంతర్గతంగా వైసీపీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. అధికారికంగా అంబటిని చిలకలూరిపేటకు పంపినట్లు గా ప్రకటిస్తే.. బదిలీ అయిన మంత్రులు ఆది మూలపు సురేశ్, విడదల రజిని, మేరుగ నాగార్జునల సర సన అంబటి కూడా చేరుతారు. సిట్టింగ్ స్థానంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను కొత్త స్థానానికి మారిస్తే ఆ వ్యతిరేకత తగ్గుతుందని జగన్ అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యం లోనే అటువారిని ఇటు.. ఇటు వారిని అటు మారుస్తూ కొత్త రాజకీయ క్రీడకు జగన్ తెర తీశారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



అక్రమార్కులకే విచారణ బాధ్యత

- దొంగ ఓట్ల నమోదు ఫిర్యాదు నీరుగార్చే యత్నం
- విచారణ జాప్యంపై ఈఆర్వోకు టీడీపీ నాయకుల ఫిర్యాదు

అద్దంకి, మార్చి 6: ఇతర జిల్లాలకు చెందిన వారికి అద్దంకి నియోజకవర్గంలో అక్రమంగా ఓటర్లుగా నమోదుపై విచారణను నీరుగార్చేయత్నం జరుగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైతే అధికారులు ఓట్ల అక్రమాలకు పాల్పడినారో వారికే దీనిపై విచారణ బాధ్యతలు అప్పగించారని సమాచారం. అయితే దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన అధికారులే విచారణ అధికారులుగా ఉండటంతో విచారణ జాప్యంతో పాటు నీరు గార్చే ప్రయత్నం జరుగుతుందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా డిసెంబరులో పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన పాణెం చినహనిమిరెడ్డిని నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన తన స్వగ్రామమైన దొడ్డేరుకు చెందిన 19 మందిని అద్దంకి నియోజకవర్గ ఓటర్లుగా నమోదు చేశారు. అప్పటికప్పుడు ఆధార్ కార్డుల్లో చిరునామాలు మార్చి ఓ అధికారి లాగిన్ నుంచి ఓటర్లుగా నమోదు చేశారు. ఇది బహిర్గతం కావడంతో దీనిపై విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గత నెల 21న రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ గత నెల 29న ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంతవరకు ఒక కొలిక్కి రాకపోవడంపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, అదంకి పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రాజకీయపార్టీల సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి సునీల్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులకే విచారణ బాధ్యతలు కేటాయించడంపై వారు అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు తమ తప్పులు బయట పడకుండా విషయాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వెంటనే విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని టీడీపీ నేతలు తెలిపారు.



ప్రారంభ ప్రార్థనలు చేస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు

నేటి నుంచి గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు), మార్చి 6: గుంటూరు సమీపంలోని హోసన్నా మినిస్ట్రీస్ గోరంట్ల ఆధ్వర్యంలో 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ గురువారం సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభం కానుంది. నాలుగు రోజులు జరిగే పండుగకు లక్షల మంది విశ్వాసులు హాజరవుతారు. పగలు, రాత్రి సమయాల్లో జరిగే ప్రార్థనలకు వేర్వేరు వేదికలను సిద్ధం చేశారు. ప్రార్థనలను తిలకించేందుకు ఆవరణలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రే వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి పలువురు చేరుకున్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రాజు, ఫైడిపాల్, రమేష్‌తో పాటు దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన జాషువమోజేస్ ప్రారంభ ప్రార్థనలు, క్రీస్తు గీతాలు ఆలపించారు.

పండుగకు ప్రత్యేక రైళ్లు

గుడారాల పండుగకి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. నెంబరు.07225 అనకాపల్లి - గుంటూరు రైలు బుధవారం రాత్రి 7.40కి బయలుదేరి గురువారం ఉదయం 7 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. నెంబరు. 07226 గుంటూరు - అనకాపల్లి రైలు ఈ నెల 10న రాత్రి 10.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి అనకాపల్లి చేరుకుంటుంది.

ఇటలీ వెళ్లిన కల్కి



ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణే, దిశా పటాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటలీలోని అద్భుతమైన లొకేషన్స్‌లో ప్రభాస్, దిశా పటానిపై పాట చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్, దిశా పటాని, నాగ్ అశ్విన్ ఇతర యూనిట్ సభ్యులతో దిగిన ఫొటోని బుధవారం మేకర్స్ షేర్ చేశారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కల్కి 2898' చిత్రం మే 9న విడుదల కానుంది.

బైక్ రేసర్‌గా శర్వా



యువ కథానాయకుడు శర్వానంద్ ప్రస్తుతం తన 35వ చిత్రం 'మనమే'లో నటిస్తున్నారు. ఆయనతో 'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మహానుభావుడు' చిత్రాలను నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజా చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శర్వా పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆయన 36వ చిత్రం షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. తొలిసారిగా శర్వా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో చిత్రాన్ని చేస్తున్నారు. ఇందులో ఆయన బైక్ రేసర్‌గా నటిస్తున్నారు. మోటో క్రాస్ రేసింగ్ నేపథ్యంలో కుటుంబంలోని మూడు తరాలకు చెందిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్నారు. శర్వానంద్, హీరోయిన్ మాళవిక నాయర్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చిత్ర సమర్పకుడు విక్రమ్ తొలి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, ఫొటోగ్రఫీ: జె.యువరాజ్, ఎడిటర్: అనిల్ కుమార్, రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర.

ఈ పుట్టినరోజు సందర్భంగానే శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం 'మనమే'. 37వ చిత్రం డిటైల్స్, లుక్స్ విడుదల చేశారు.

మొదట ఎన్టీఆర్.. ఇప్పుడు రామ్‌చరణ్



అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటించే రెండో తెలుగు చిత్రం కూడా కన్‌ఫర్మ్ అయింది. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఆమె తాజాగా రామ్‌చరణ్ హీరోగా నటించే 16వ సినిమాలో కథానాయికగా నటించనున్నారు. జాన్వీ ఈ చిత్రం చేస్తుందనే వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఆమె తండ్రి బోనీ కపూర్ ఇటీవల ఈ విషయం వెల్లడించారు కూడా. జాన్వీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వృద్ధి సినిమాస్ అధినేతలు అధికారికంగా ఈ విషయం వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సాన ఈ సినిమా కోసం యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్ర్కిప్ట్ సిద్ధం చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత వెంకట సతీశ్ కిలారు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Ifp8YM3 లో చదవండి.

భీమ పాత్రను ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు హర్ష



గోపీచంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' ఈ శుక్రవారం విడుదలవుతోంది. కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వం వహించారు. విడుదల సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ 'నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. ఇప్పటివరకూ కన్నడ చిత్రాలే చేశాను. తెలుగులో రాధామోహన్ గారి 'బెంగాల్ టైగర్' చిత్రంలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఆయనే నన్ను తెలుగులో దర్శకుడిగా పరిచయం చేస్తుండడం ఆనందంగా ఉంది. గోపీచంద్‌గారికి మొదట ఒక కథ చెప్పాను. ఆయన కొన్ని మార్పులు చెప్పారు. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని 'భీమ' కథ చెప్పాను. అది ఆయనకు నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్, ఎలివేషన్, ఎమోషన్ కలిగిన మంచి కమర్షియల్ సినిమా ఇది. సోషల్ మెసేజ్‌తో పాటు సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. ముఖ్యంగా భీమ పాత్ర చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. గోపీచంద్ వండర్‌ఫుల్ ఆర్టిస్ట్ అని చెబుతూ 'ఆయన సినిమాలన్నీ చూశాను. తనకి యూనిక్ బాడీ లాంగ్వేజి ఉంది. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. చాలా పాజిటివ్. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. భీమ పాత్ర ఆయనకే సూట్ అవుతుందని ఆయనకే చెప్పాను' అన్నారు హర్ష. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న వ్యక్తి అనీ ఈ సినిమాకు కావాల్సిన వన్నీ సమకూర్చడంతో మంచి క్వాలిటీతో సినిమా తీయగలిగినట్లు ఆయన తెలిపారు.

సైన్స్ ఫిక్షన్ దర్శిని



వికాస్ జీకే, శాంతి హీరో హీరోయిన్లుగా రూపుదిద్దుకున్న 'దర్శిని' చిత్రం త్వరలో విడుదల కానుంది. డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో డాక్టర్ ఎల్వీ సూర్యం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం టీజర్‌ను పార్లమెంట్ సభ్యుడు ఎం.వి.వి. సత్యనారాయణ విడుదల చేసి సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఇది. సినిమా బాగా వచ్చింది. పాటలు చిత్రానికి ప్లస్ అవుతాయి.' అన్నారు. ఓ ప్రముఖ పంపిణీ సంస్థ ద్వారా త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. టీజర్, పాటలు చూసి ఆశీర్వదించిన ఎంపీ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





దిక్సూచి
DIKSUCHI

జల సంరక్షణ విధానాలు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

దేశంలో ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** బిహార్+ఉత్తరప్రదేశ్
- **దామోదర్ వ్యాలీ ప్రాజెక్ట్:** జార్ఖండ్+వెస్ట్ బెంగాల్
- **రామ్ గంగా:** ఉత్తరాఖండ్+ఉత్తరప్రదేశ్
- **చంబల్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+రాజస్థాన్
- **ఇందిరాసాగర్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+గుజరాత్
- **సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్:** గుజరాత్+రాజస్థాన్+మధ్యప్రదేశ్+మహారాష్ట్ర

అంతర్జాతీయ ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **మహాంకాళి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **కోసి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **సంకోష్ ప్రాజెక్ట్:** ఇండియా+భూటాన్
- **తనక్ పూర్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్

భారతదేశంలో సంప్రదాయ నీటిపారుదల, జల సంరక్షణ విధానాలు

- **జింగ్:** కరిగిన హిమనీ నదాల నీటిని సేకరించడానికి నిర్మించిన ట్యాంక్‌లు. ఇవి లడక్‌లో ఉన్నాయి.
- **నౌల:** ఉత్తరాఖండ్‌లో చుట్టుపక్కల ప్రవాహాల నుంచి నీటిని సేకరించడానికి నిర్మించిన చిన్న చిన్న బావులు
- **ఖుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన కాలువలు
- **గుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు
- **బౌడి:** హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్, కాంగ్రా, మండి జిల్లాల్లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను సేకరించడానికి ప్రత్యేకంగా నిర్మించిన బావులు.
- **నాన్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో తాగునీటి కోసం, ఇంటి అవసరాల కోసం నిర్మించిన బావులు.
- **ఖత్రి:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే వర్షపు నీటిని సేకరించడానికి రాళ్లతో నిర్మించిన బావులు
- **డిఘీ:** ఢిల్లీ ప్రాంతంలో నిర్మించిన చిన్న చిన్న బావులు లేదా కుంటలు
- **అహర్-పైన్స్:** అహర్- బిహార్‌లో వర్షపు నీటిని మళ్లించి నిల్వచేసేందుకు నిర్మించిన జలాశయాలు. పైన్స్-అహర్...జలాశయాల నుంచి నీటిని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించడానికి నిర్మించిన చిన్న చిన్న నీటిపారుదల కాలువలు.
- **అపతాని:** అరుణాచల్ ప్రదేశ్‌లో ఉపరితల, భూగర్భ జలాలను ఉపయోగించి వరి, చేపల పెంపకం చేపట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతులు
- **జబో/రుజా:** నాగాలాండ్‌లో వరద ప్రవాహాన్ని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కాలువలు.
- **చీవ్-ఓజిహి:** నాగాలాండ్‌లో కొండ వాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన అతి పొడవైన వెదురుపైపుల కాలువలు.
- **తుయ్ ఖుర్:** మణిపూర్, మిజోరాంలలో ఉన్న నీటి బుగ్గలు
- **వెదురు డ్రిప్:** మేఘాలయాలో వాలుల వెంబడి ప్రవహించే నీటిని సేకరించి అత్యధిక దూరంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు నీటిని తీసుకెళ్లే వెదురు పైపులు.
- **డాంగ్స్:** అసోంలోని బోడో తెగలు ఉపయోగించే నీటి కుంటలు



- **గర్-దార:** చుట్టుపక్కల ఉండే నీటి ప్రవాహాల నుంచి నీటిని సేకరించి నిల్వ ఉంచే అతిపెద్ద బావులు
- **డంగ్స్/జంపోయిస్:** పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురిలో వరి పొలాల కోసం ఏర్పాటు చేసిన నీటి కాలువలు
- **ఇనుండేషన్ ఛానెల్స్:** పశ్చిమ బెంగాల్‌లో వరద ప్రవాహాన్ని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు.
- **పాట్:** మధ్యప్రదేశ్‌లోని బాబువ ప్రాంతంలో నీటి ప్రవాహాలను మళ్లించడానికి నిర్మించిన కట్టలు.
- **కటాస్/బందాస్:** ఒడిశాలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **హవేలి:** మధ్యప్రదేశ్‌లోని వ్యవసాయ క్షేత్రాలలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **కుయిస్/బెరీస్:** రాజస్థాన్‌లో వర్షపు నీటిని సేకరించేందుకు ఏర్పాటు చేసిన లోతైన గుంతలు
- **బావోరీస్/బెర్స్:** రాజస్థాన్‌లో ప్రధానంగా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బావులు
- **పార్:** రాజస్థాన్‌లో లోతైన గుంతలలో(బెరీస్) నిల్వ చేసిన నీటిని వాడుకునే ప్రాంతం
- **కుండ్స్/కుండీస్:** రాజస్థాన్‌లోని పాళీ ప్రాంతంలో సాసర్ ఆకారపు పరివాహప్రాంతాన్ని కలిగిన వలయాకారపు భూగర్భ బావులు
- **తలాబ్/నాడి:** రాజస్థాన్‌లోని జోద్‌పూర్ ప్రాంతంలోని గ్రామాలలో నిర్మించిన నీటి కుంటలు.
- **టంకాలు:** బికనీర్ ప్రాంతంలో గృహాలలో తాగునీటి కోసం సున్నపురాయితో నిర్మించే బావులు
- **బావోళి/బావడి:** రాజస్థాన్‌లో దిగుడు మెట్ల బావిని పోలిన నిర్మాణాలు. వీటినే 'వావ్' లేదా 'వారధి' అని గుజరాత్‌లో పిలుస్తారు.
- **జోహాడ్స్:** రాజస్థాన్‌లో వాలుకు అనుగుణంగా మూడు వైపులా కట్టలు నిర్మించి ఒక వైపున నీరు ప్రవహించడానికి అనువుగా నిర్మించిన నిర్మాణాలు. వర్షపు నీరు భూమిలోనికి ఇంకడానికి ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి.
- **పాడ్, భాండారాలు:** మహారాష్ట్రలోని తపతి నది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. బందారా అంటే చిన్న వాగుల మీద అడ్డంగా కట్టిన కట్టలు. వాటి నుంచి కాలువలు తవ్వి, నీటిని వ్యవసాయ భూములకు తరలిస్తారు. ఈ వ్యవసాయ భూములను పాహాడ్స్ అంటారు.

నోట్: తమిళనాడు రాష్ట్రం మొట్ట మొదటి సారిగా వర్షపు నీటిని నిల్వ చేయటాన్ని చట్టంగా చేసింది.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

ఏపీ ఐసెట్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)-ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 7
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 28 నుంచి 29 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 2 నుంచి
- **ఏపీ ఐసెట్ 2024 తేదీలు:** మే 6, 7
- **ఫలితాలు విడుదల:** జూన్ 20
- **వెబ్‌సైట్:** cets.apsche.ap. gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/eXWZjTIలో చదవండి.

నిట్ ఎంసీఏలో ప్రవేశానికి నిమ్‌సెట్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సంస్థలు అందిస్తున్న మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన 'నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (నిమ్‌సెట్) 2024' నోటిఫికేషన్ వెలువడింది. దీనిని నిట్ జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఇందులో ఐఐఐటీ భోపాల్ సహా వరంగల్, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచిరాపల్లి, కురుక్షేత్ర, అగర్తల, జంషెడ్‌పూర్, భోపాల్, అలహాబాద్, పట్నా నిట్‌లు పార్టిసిపేట్ చేస్తున్నాయి. నిమ్‌సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: మొత్తం 1033 సీట్లు ఉన్నాయి. వరంగల్ నిట్‌లో 58, తిరుచిరాపల్లి నిట్‌లో 115, సూరత్కల్ నిట్‌లో 58, రాయ్‌పూర్ నిట్‌లో 110, కురుక్షేత్ర నిట్‌లో 96(వీటిలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ సీట్లు 32), జంషెడ్‌పూర్ నిట్‌లో 115, భోపాల్ ఎంఏఎన్‌ఐటీలో 115, అలహాబాద్ ఎంఏఎన్ ఐటీలో 116, అగర్తల నిట్‌లో 30 సీట్లు ఉన్నాయి. పట్నా నిట్‌లో డేటా సైన్స్&ఇన్ఫర్మాటిక్స్ 80, ఏఐ&ఐఓటీ 80 సీట్లు ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద ప్రతి స్పెషలైజేషన్‌లో సగం సీట్లు కేటాయించారు. భోపాల్ ఐఐఐటీలో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు; బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు; ఓపెన్ యూనివర్సిటీల నుంచి దూరవిద్య విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

నిమ్‌సెట్ వివరాలు: ఈ పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 70 నిమిషాల పరీక్ష సమయం ఉంటుంది. రెండో పార్ట్‌లో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల సమయం ఇస్తారు. మూడో పార్ట్‌లో కంప్యూటర్ అవేర్‌నెస్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 20 నిమిషాల సమయం ఇస్తారు. మేథమెటిక్స్ ప్రశ్నలకు ఒక్కోదానికి 12 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రశ్నలకు ఒక్కోదానికి 6 మార్కులు; జనరల్ ఇంగ్లీష్ ప్రశ్నలకు ఒక్కోదానికి 4 మార్కులు కేటాయించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 1000. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.nimcet.in, www.nimcet.admissions.nic.in




ఖిద్మత్ టీం అధ్యక్షుడు షఫీకి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నారా లోకేశ్

టీడీపీలో చేరిన ఖిద్మత్ టీం అధ్యక్షుడు షఫీ

● మరో 200 కుటుంబాలు టీడీపీలో చేరిక .. ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరిసిటీ, మార్చి6: ఖిద్మత్ టీం వ్యవస్థాపక అధ్యక్షుడు, మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన షేక్ షఫీ బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో తన అనుచరులు, మద్దతుదారులైన రెండొందల మందితో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఖిద్మత్‌టీం ద్వారా షఫీ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ దగ్గరయ్యారు. కొవిడ్ సమయంలో అనాథ, పేద కుటుంబాలకు చేయూతనందించి, అనాథ శవాలకు దహన సంస్కారాలను ఖిద్మత్‌కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. అధికారంలో లేకపోయినా మంగళగిరిలో లోకేశ్ ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో లోకేశ్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని షఫీ పేర్కొన్నారు.

వీరితోపాటు దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన 25 దళిత కుటుంబాలు, మరో 25 యాదవ సామాజికవర్గ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ పార్టీలో చేరుతున్న వారికి రాబోయే రోజుల్లో తగిన ప్రాధాన్యతనిస్తామని లోకేశ్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జానకీదేవి, రాజు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


కానిస్టేబుల్ అశోక్ (ఫైల్)

చిలకలూరిపేట,మార్చి6:యడ్లపాడు పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎన్.అశోక్(35) బుధవారం చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కోటప్పకొండలో విధి నిర్వహణలో పాల్గొన్న అనంతరం ద్విచక్రవాహనం పై తిరిగి చిలకలూరిపేటకు వస్తుండగా పట్టణ పరిధిలోని సింగ్‌నగర్ వద్ద మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. గుంటూరులో నివాసం ఉంటున్న అశోక్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు. కాగా ప్రమాద వార్త తెలిసిన వెంటనే చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, అర్బన్ సీఐ పీ రమేష్, అర్బన్ ఎస్ఐలు సుబ్బారావు, సుమన్, ఇతర పోలీసు సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు.

తిరునాళ్లకు.. చేరుకోండిలా..

08-03-2024 మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళ పార్కింగ్ ప్రదేశములు



నరసరావుపేట, మార్చి 6: కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలను భక్తులు పాటించాలని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి బుధవారం సూచించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సంత మాగులూరు వైపు నుంచి కోటప్పకొండకు వచ్చే రహదారులు, పార్కింగ్ స్థలాల వివరాలు వెల్లడించారు.

- నరసరావుపేట నుంచి కోటప్పకొండకు వచ్చే భక్తులు, వీఐపీలు వారి వాహనాలు, ఆర్టీసీ బస్సులలో ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక ఏర్పాటుచేసిన మట్టి రోడ్డును ఉపయోగించుకొని కొండకావూరు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జెఎన్‌టీయూ కాలేజీ మీదుగా వినుకొండ రోడ్డుకు చేరుకోవాలి.
- ప్రకాశం జిల్లా సంతమాగులూరు వైపు నుంచి వచ్చే భక్తులు లక్ష్మీపురం కాలువ రోడ్డు, మిన్నెకల్లు, గురిజేపల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. మిన్నెకల్లు నుంచి కోటప్పకొండవైపు వాహనాలు అనుమతించబడవు. తిరుగుప్రయాణంలో గురుజేపల్లి మీదుగా సంతమాగులూరు వెళ్లాలి.
- చిలకలూరిపేట వైపే నుంచి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ జంక్షన్‌చేరి శారద ఫార్మసీవద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను ఉపయోగించుకోవాలి. ఈ మార్గంలో వచ్చే వీఐపీలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి ఎడమవైపుకు క్రషర్ రోడ్ మీదుగా వీఐపీ పార్కింగ్‌లో వాహనాలు ఉంచాలి. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్‌ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- చిలకలూరిపేట నుంచి వెళ్లే ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ మీదుగా నిధి దారి గుండా ప్రభల నిలిచే స్థలానికి తరలించాలి. చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టలఫ్యాక్టరీ రోడ్డు మీదుగా యక్కలవారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్‌కు చేరాలి.
- చిలకలూరిపేట వైపు తిరిగి వెళ్లే భక్తులు శారద ఫార్మసీ దగ్గరలో పార్కింగ్ నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు యూటీ జంక్షన్ చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం, గోవిందాపురం, కోమటినేనివారి పాలెం మీదుగా నరసరావుపేట- చిలకలూరిపేట రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- గంగన్నపాలెం, కోమటినేనివారి పాలెం నుంచి వచ్చు భక్తులు గోవిందాపురం, కమ్మవారిపాలెం మీదుగా మద్దిరాల చేరి యడవల్లి, యూటీ జంక్షన్‌ల మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరాలి.
- అవిశాయపాలెం, కేసానుపల్లిమీదుగా కోటప్పకొండకువచ్చే భక్తులు ఎస్ఆర్‌కేటీ యలమంద గ్రామం మీదుగా కోటప్పకొండకు వెళ్లాలి.
- యలమంద, గురువాయపాలెంవైపు నుంచి వచ్చే భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్‌ను చేరి, యాదవ సత్రానికి వెనుక పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసుకొనవలెను.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి నరసరావుపేటకి వెళ్లే వాహనాలు, చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటు చేసిన రూట్‌లో మాత్రమే వెళ్లి ఏఎంరెడ్డి కాలేజి వద్ద నరసరావుపేట బైపాస్‌కు వెళ్లాలి. గురవాయపాలెం, యల్లమంద మీదుగా నరసరావుపేటవైపునకు వెళ్ళుటకు వాహనాలు అనుమంతించబడవు.
- నరసరావుపేట టౌన్ నుంచి కోటప్పకొండకి వచ్చే ప్రభలు ఉదయం 10 గంటలకు బయలదేరి వయా యల్లమంద, గురవాయపాలెంమీదుగా సాయంత్రం 4గంటలకి ప్రభల నిధికి చేరుకోవాలి.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి రాత్రి 1 గంట తర్వాత తిరిగి వెళ్ళే వాహనాలు ఐరన్ బ్రిడ్జి మీదుగా గోనేపూడి, కేసానుపల్లి మీదుగా నరసరావుపేట, చిలకలూరిపేట వైపుకు గానీ వెళ్ళ వచ్చు.
- ఏఎంరెడ్డి కాలేజ్ జంక్షన్ నుంచి కాలుకట్ట పైకి అనుమతి లేదు.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక యాప్

కోటప్పకొండ తిరునాళ్ళకు వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగు చేసుకోవడానికి పల్నాడు జిల్లా పోలీసు వారిచే ఏర్పాటు చేసిన కోటప్పకొండ పార్కింగ్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని హోం పేజీలో కనపడే బైక్, ఆటో, కార్, ట్రాక్టర్ గుర్తులపై టచ్‌చేసే మీకు దగ్గరలోని పార్కింగ్ స్థలాలను సూచిస్తుంది. వాటిలో అందుబాటులో ఉన్న పార్కింగు ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

కోటప్పకొండకు 100 ప్రత్యేక బస్సులు

చిలకలూరిపేట అర్బన్, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ వెళ్ళే యాత్రికులకు డిపో నుంచి 100 ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు తెలిపారు. సుమారు లక్షమంది ప్రయాణీకులను కోటప్పకొండకు చేర్చినందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వలంటీర్లు, డ్రైవర్లు మొబైల్ టీంల సేవలను వినియోగించుకొని ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ ట్రాఫిక్ చీఫ్ మేనేజర్ ఎం.ఇబ్రహీం పాల్గొన్నారు.


కోడెల విగ్రహానికి నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు, డాక్టర్ అరవిందబాబు, మక్కెన మల్లికార్జునరావు, తదితరులు

ఘనంగా కోడెల విగ్రహావిష్కరణ

నరసరావుపేటటౌన్, మార్చి 6 : నరసరావుపేట మండలం కోటప్పకొండ కాకతీయ సేవాసమితి ఆవరణలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహ ఆవిష్కరణ బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ వినుకొండ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, అట్లా చిన వెంకటరెడ్డి, డాక్టర్ కోడెల శివరామకృష్ణ, సాదినేని కోటేశ్వరరావు, పున్నయ్య, మస్తానయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడల శివరామకృష్ణ మాట్లాడుతూ కోటప్పకొండలో, కాకతీయ సత్రంలో జరుగుతున్న ప్రతి అభివద్ధి వెనుక కోడెల శివప్రసాదరావు ఉన్నారన్నారు. అన్నదానంతో కులమతాలకు అతీతంగా ఆదరించాలని డాక్టర్ కోడెల తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయం అన్నారు. కార్య క్రమంలో అనుమోలు వెంకయ్యచౌదరి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల,మార్చి6: రేపటి టీడీపీ, జనసేన ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలోబీసీలకు పెద్ద పీట వేయటం జరుగుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి వద్ద జరిగిన జయహో బీసీ భారీ బహిరంగసభలో ఆమోదించిన బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలో లక్షలాది మంది బీసీలకు మేలు జరుగు తుంద న్నారు. రాష్ట్రంలో టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పాటయ్యాక బీసీలలో 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 16,800 మందిని పదవులకు దూరం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక బీసీల రిజర్వేషన్‌ను 34 శాతం పునరుద్ధరిస్తామని యరప తినేని తెలిపారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరించడంతో పాటు పెళ్లికానుక లక్ష రూపాయలు పెంచడం, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌లో పొందుపరచిన పథకాలను వారికే అమలయ్యేలా చేయనున్నట్లు యరపతినేని తెలిపారు.

జయహో బీసీ సభ ఓ సంచలనం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయలు


సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 6: నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరిగిన బీసీ సభ దేశంలోనే ఒక సంచలనం సృష్టించిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీవీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, అచ్చెన్నాయుడు, పెద్దలందరూ పాల్గొన్న ఈ గొప్ప సభ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. బీసీలది యాచించే స్థాయి కాదని శాసించే స్థాయికి వారిని అభివృద్ధి చేయటం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ లక్ష్యం అన్నారు. రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించింది అన్న ఎన్‌టీఆర్, టీడీపీ అన్నారు. ఎన్టీ రామారావు మొదటి బీసీలకు 24 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చి వాళ్ళకు కొండంత అండగా నిలబడ్డారని, చంద్రబాబు వచ్చిన తర్వాత దానిని 34 శాతానికి పెంచి మరింత సామాజిక న్యాయం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వందలాది మందిని హత్య చేయించి పొట్టన పెట్టుకున్నాడని విమర్శించారు. బీసీల వెన్నెముక విరగగొట్టాలని 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించారన్నారు. జయహో బీసీ సభ జరిగిన తర్వాత జగన్‌రెడ్డి వణికి పోతున్నారన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం, చంద్రబాబును సీఎంని చేసుకోవాలని కోరారు. సమావేశంలో టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, అట్లా చిన వెంకటరెడ్డి, కుమ్మెత కోటిరెడ్డి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, వెంకట నరసయ్య, కొండలు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి, కొట్టా కిరణ్‌కుమార్, కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్‌బాబు, పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆలపాటి రాజా

భూహక్కు చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

● మాజీ మంత్రి ఆలపాటి రాజా ● న్యాయవాదుల దీక్షలకు మద్దతు

గుంటూరు(లీగల్), మార్చి6: హైకోర్టు ఎన్నిసార్లు చివాట్లు పెట్టిన ఈ ముఖ్యమంత్రికి, ప్రభుత్వ అధికారులకు బుద్ధి రావటం లేదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. భూ హక్కు చట్టం రద్దు చేయాలని డిమాండ్‌తో గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన నిరసనలు బుధవారం 60వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి మస్తాన్‌వలి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ళ సురేష్ తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ సామాన్య పౌరులకు రాజ్యాంగబద్ధమైన పాలన అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులపైనే ఉందని చెప్పారు. ప్రజల ఆస్తిపత్రాలపై ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టడం తుగ్లక్ చర్య అని పేర్కొంటూ భూహక్కు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, రేపు ప్రభుత్వం మారిన వెంటనే దీనిని రద్దు చేస్తారని తెలిపారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ భూహక్కు చట్టంలో ఎన్నో లోపాలు ఉన్నాయని, ఈ చట్టం అమలులోకి వస్తే అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో బుధవారం పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొని భూహక్కు చట్టం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

పేదల భూములపై వైసీపీ రాబందులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

● అసైన్డ్ భూములు కాజేయడానికే జగన్ ఆర్డినెన్స్
● కలెక్టర్ సహకారంతోనే కిలారి భూదోపిడీ
● కిలారిపై విచారణ జరిపించాలి
● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయింది మొదలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆయన, ఆయన అనుచరులు పేదల భూములను రాబందుల్లాగా తన్నుకుపోతున్నారని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దళితులు తమ ఆర్థిక అవసరాలనిమిత్తం తమకు అసైన్ చేసిన భూములు అమ్ముకోవచ్చని సవరణ చేసి ఆ భూములను కాజేసేందుకు జగన్, ఆయన అనుయాయులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాగానే వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డంపెట్టుకొని దళితుల భూములను లాక్కోవడానికి కలెక్టర్‌తో సహా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూములను తమ బినామీ పేర్ల మీదకు మార్చేశారన్నారు. సుప్రీంకోర్టు నియమ, నిబంధనలు తుంగలోతొక్కి జీవో తెచ్చి బినామిలా పేర్లతో కొట్టేయడం మొదలుపెట్టారన్నారు. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని అనుమర్లపూడి గ్రామంలో 1972 నుంచి 2022 వరకూ దళితుల పేరున వున్న 30 ఎకరాల అసైన్డ్‌భూమిని దోపిడీచేసేందుకు కలెక్టర్ సాయంతో వైసీపీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య తెరలేపారన్నారు. 2011-12లో రెవెన్యూ అధికారులు దళితుల పేర ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను నేడు 22ఏ కింద తొలగించమని కలెక్టర్ ఏవిధంగా ఆదేశాలిచ్చారో చెప్పాలని డిమాండ్‌చేశారు. అసైన్‌దారుల వారసులకు మాత్రమే హక్కులుండే ఆ భూములకు వారసులను వైసీపీ నేతలే సృష్టించి రూ.50 కోట్లు విలువ చేసే విలువైన భూములు 30 ఎకరాలు దోపిడి చేశారన్నారు. దళితుల భూములు దోచుకున్న కిలారుపై విచారణ చేయించే ధైర్యం సీఎంకి ఉందా అని సవాల్ విసిరారు. దళితులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రాజామాస్టారు, ఇమ్మానుయేల్, డి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, సాయికృష్ణ, మురళీకృష్ణ, హుస్సేన్, ఫిరోజ్, హజార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణానది స్నానఘాట్‌లో జల్లు స్నానానికి ఏర్పాటు చేసిన పైపులైన్

శివరాత్రి వేడుకలకు అమరేశ్వరాలయం సిద్ధం

అమరావతి, మార్చి 6: మహా శివరాత్రి ఉత్సవాలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 8న మహాశివరాతిర పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివార్లను పెళ్లికుమారుడిగాచేయగా బుధవారం వివిధ పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణచేశారు. భక్తుల సౌకర్యార్థం క్యూలు, షామియానాలు, ప్రసాదాలను సిద్ధంచేస్తున్నారు. ప్రధాన రాజగోపురంతో పాటు వివిధ ఆలయ శిఖరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం అడుగంటడంతో జల్లు స్థానానికి షవర్లు ఏర్పాటు చేశారు.

ఏడు గృహాలు అగ్నికి ఆహుతి

● విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం
● నిరాశ్రయులైన తొమ్మిది కుటుంబాలు
● బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ పరామర్శ..


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మార్చి6: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్థరాత్రి చెలరేగిన మంటలతో ఏడు గృహాలు కాలి బూడిదకాగా తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులలైన ఘటన పొన్నూరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో ఈ ప్రమాదం సంభవించింది. దీంతో ఇళ్లలోని వస్తు సామగ్రి, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఏడు గృహాల్లో నివసిస్తున్న తొమ్మిది కుటుంబాల వారు నిరాశ్రయులు అయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో తలపల శ్రీను, కొమరగిరి మల్లేశ్వరరావు, తలపుల భారతి, పొదిలి కృష్ణ, శ్రీను, అడ్డూరి శ్రీనివాసరావు, శివ మల్లిఖార్జునరావు, సరోజనమ్మ, చెల్లంచర్ల పోలమ్మలకు చెందిన గృహాలు దగ్ధమయ్యాయి.

బాధిత కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు సాయాన్ని టీడీపీ నేతల ద్వారా అందచేశారు. ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి అన్ని రకాలుగా ఆదుకోవాలని నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, తట్ట బులయ్య, మన్యం ఆంజనేయులు, నడికట్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున సహాయం అందించారు.

ఎక్సైజ్ డీసీగా బాజ్జీరావ్ బాధ్యతల స్వీకారం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌వీవీఎన్ బాజ్జీ రావు

గుంటూరు(కార్పొరేషన్),మార్చి6: గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ డీసీగా ఉన్న టి.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాబ్జీరావ్ వైజాగ్ డీసీగా పని చేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. ఇక్కడ వున్న శ్రీనివాసరావును విజయవాడ ఏపీఎస్ బీసీఎల్‌లో డీజీఎంగా బదిలీచేశారు. ఈసందర్భంగా ఎస్‌వీవీఎన్ ఎన్ బాజ్జీరావు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖను పటిష్ట పరిచేందుకు కృషి చేస్తామన్నారు.

అమరావతిపై జగన్‌రెడ్డి అసత్య ప్రచారం

● సీఎం అండ్ కో లబ్ధికోసమే విశాఖ జపం
● 1541వ రోజుకు రైతులఆందోళనలు


తుళ్లూరు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 6: రాజధాని అమరావతి నిర్మాణానికి వేల కోట్లు రూపా యలు కావాలని సీఎం జగన్‌రెడ్డి అబద్దపు ప్రచారం చేస్తున్నాడని, సెల్ఫ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూపాయి పెట్టుబడి పెట్టే పనిలేదని రాజధాని నిర్మాణానికి భూములు త్యాగంచేసిన రైతులు తెలిపారు. బిల్డ్ అమరావతి అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1541వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి ఎన్ని ఎత్తుగడలు వేసి విష ప్రచా రాలు చేసినా అమరావతిని నాశనం చేయలేడని, అమరావతే రాష్ట్ర రాజధాని అని స్పష్టం చేశారు. సీఎం జగన్‌రెడ్డి అండ్ కో లబ్ధికోసమే విశాఖ జపం చేస్తున్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని ప్రాంత గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

1,38,827 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,44,511 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,38,827 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,09,145 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11000	19200
273	10200	18000
341	8500	19000
4884	12000	15000
సూపర్ 10	9500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	20200
బ్యాడిగి	10000	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	12000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

టీడీపీ శ్రేణులు సైనికుల వలే పని చేయాలి

● నియోజకవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 6: సార్వత్రిక ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున పార్టీ శ్రేణులంతా సైనికులవలే పని చేయాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కోరారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ కష్టపడి ప్రతిఒక్కరు పని చేయాలని అప్పుడే విజయం మన సొంతం అవుతుందన్నారు. ఎన్నికలకు ఇంకా 40రోజులు మాత్రమే ఉన్నందున జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవటానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుంది కాబట్టి సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్‌ను ప్రతి ఇంటింటికి తీసుకెళ్ళి వివరించాలన్నారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు సలగల రాజశేఖర్, తాతా జయప్రకాష్ నారాయణ, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లం సరోజనీ, కర్లపాలెం జడ్పీటీసీ మెంబరు పిట్టు వేణుగోపాలరెడ్డి, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షులు వై.భూపతిరావు, ఎండీ అఫ్జల్, విన్నకోట వీరయ్యనాయుడు, యూనిట్, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నరేంద్రవర్మ విజయానికి కృషి చేయాలి

● టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని

బాపట్ల, మార్చి 6 : మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపెయిన్ బుధవారం 8వ వార్డు 53వ పోలింగ్‌బూత్ పరిధిలో నిర్వహించారు. కొత్తఓట్లు ఎన్‌రోల్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని మాట్లాడుతూ బాపట్ల ఎమ్మెల్యేగా నరేంద్రవర్మను గెలిపించాలని అభ్యర్థించారు. యువత భవిష్యతు టీడీపీతోనే సాధ్యం కాబట్టి నూతనంగా ఓటు హక్కు పొందిన వారంతా నరేంద్రవర్మకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, టీడీపీ నాయకులు షేక్ కాలేషా, మస్తాన్‌వలి, షేక్ ఇసుదాని, షేక్. ఇలాహి, కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు కొండంత భరోసా : కలెక్టర్

బాపట్ల, మార్చి 6 : మిచౌంగ్‌తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకొని కొండంత భరోసానిచ్చిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బుధవారం బటనొక్కి ప్రారంభించగా కలెక్టరేట్‌లో వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రైతులతో వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రితో మాట్లాడించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 64,634.08 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానపంటలు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్నాయన్నారు. 93,471 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. వారందరికి పెట్టుబడి రాయితీ కింద 104.73 కోట్ల నగదును ప్రభుత్వం రైతుల బ్యాంక్‌ఖాతాలకు నేరుగా జమ చేసిందని తెలిపారు. ఎంపీ నందిగం సురేష్, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు కోన రఘుపతి, కరణం బలరామకృష్ణమూర్తి, వేమూరు వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, డీడీ విజయనిర్మల, ఉద్యానశాఖ ఏడీ జెన్నెమ్మ, ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణ, నాయకులు ప్రసాదరావు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ సురేష్, ఎమ్మెల్యే బలరాం కృష్ణమూర్తి

వారంలోపు దరఖాస్తుల పరిష్కారం : కలెక్టర్

బాపట్ల, మార్చి 6: ఓటర్లకు సంబంధించిన ఫారం-6, 7, 8 దరఖాస్తులను వారంలోపు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వివిధ రాజకీయపక్షాలు సహకారం అందించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాజకీయపార్టీల ప్రతినిధులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్‌స్టేషన్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన కాకుండా రాజకీయపార్టీలు తమ వంతు సహకారం అందించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, స్ట్రాంగ్‌రూమ్‌లకు జీపీఎస్ ట్రాకింగ్‌తో కూడిన ఎస్కార్ట్ భద్రత ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి పారదర్శకతతో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలకు అందరూ సహకరించాలన్నారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు

కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలను సిద్ధంగా ఉంచామని కలెక్టర్ తెలిపారు. బాపట్ల మార్కెట్‌యార్డులోని ఈవీ ఎం గోదాములను రాజకీయపార్టీల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూ పొందించిన ఈవీఎంలను వినియోగిస్తున్నామన్నారు. జిల్లాలో 1510 పోలింగ్ కేం ద్రాలు ఉండగా ప్రస్తుతం 1812 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 1963 వీవీ ప్యాట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్వో సత్తిబాబు, ఈఆర్వో లు, ఈవీఎం గోదాం జిల్లా నోడల్ ఆఫీసర్ సుధాకర్‌బాబు, కలెక్టరేట్ ఏవో కృష్ణకాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, షేక్.మహ్మద్‌గౌస్‌బాషా, రామకృష్ణ, కాగిత కోటేశ్వరరావు, నూతలపాటి కోటేశ్వరరావు, సిహెచ్. గంగయ్య పాల్గొన్నారు.

గడియారస్తంభం సెంటర్‌కు గాంధీచౌక్‌గా నామకరణ



గడియార స్తంభం పక్కనే ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, ఆర్యవైశ్యసంఘనాయకులు

బాపట్ల, మార్చి 6 : జీబీసీ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని గడియార స్తంభం పక్కనే ఏర్పాటు చేసి బుధవారం ఎమ్మెల్యే కోన రఘుపతి ఆర్యవైశ్య సంఘనాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆ ప్రాంతాన్ని గాంధీచౌక్‌గా నామకరణ చేశారు. మహాత్మాగాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. బాపట్ల ఆర్యవైశ్యసంఘం, యంగ్‌మెన్ వైశ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ కొత్తమాసు సత్యనారాయణ, కోళ్ళపూడి సురేష్, బూర్లె అనీల్ కుమార్, కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, తూనుగుంట్ల శ్రీనివాసరావు, నాళం నరేష్, పల్లపోతు దిలీప్, యారం మణి, ఇమ్మడిశెట్టి రాము, బుర్రంశెట్టి సుజిత్, శ్రీను, రమేష్, పారెపల్లి చందు, పుల్లయ్య గుప్తా, కోళ్ళపూడి బుల్లిబాబు, నాగవరపు అనీల్, బొమ్మిశెట్టి ప్రసాద్, బూర్లె గురునాథం, బొగ్గవరపు శివ, వనమా ఆదినారాయణ, కొల్లిపర శ్రీనివాసరావు, వి.అఖిల్ పాల్గొన్నారు.

బాల్యవివాహరహిత మండలంగా తీర్చిదిద్దాలి : తహసీల్దార్

కర్లపాలెం, మార్చి 6: కర్లపాలెం మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలని కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సీఫార్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వ ర్యంలో మండల స్టేక్ హోల్డర్స్ సమావేశంలో తహసీల్దార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి అడుసుమల్లి ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. బాల్యవివాహాల నిర్మూలనకు సమాజంలో ప్రతిఒక్క పౌరుడు కృషి చేయాలని తహసీల్దార్ సూచించారు. బాల్యవివాహ నిరోధచట్టం గురించి గ్రామాల్లోని ప్రజలకు అవ గాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ బాల్యవివాహ నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీపీ యారం వనజ అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బడుగు కిషోర్, మర్రిపాల నాగరాజు, మల్లెల సరిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన పీడ వదిలించేందుకే పొత్తు

● మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆనందబాబు

● చిలుమూరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం



ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

కొల్లూరు, మార్చి 6: రాష్ట్రానికి పట్టిన పీడ విరగడ చేసి ప్రజల ఇబ్బందులను గట్టెక్కించేందుకు టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం కొల్లూరు నియోజకవర్గంలోని చిలుమూరు ఉభయ రామేశ్వర క్షేత్రం, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ఎస్సీ కాలనీలో ప్రచారం సాగిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవ సేవకుల ఆశీర్వాదం పొందారు. పాత చిలుమూరులో పాదయాత్రగా ఇంటింటికి తిరిగి బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ తనకే ఓటు ఓయాలని కోరారు. కొత్త కాలనీలో ప్రచారం సాగిస్తూ తన హయాంలో కాలనీ అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తూ గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు మేము టీడీపీ సానుభూతి పరులమని తమ పింఛన్లు తొలగించారంటూ ఆయన దృష్టికి తీసుకువెళ్లగా మన ప్రభుత్వం వచ్చిన వెంటనే మీ పింఛన్లు పునరుద్ధరించడంతో పాటు తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. పాత, కొత్త చిలుమూరులో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. కొత్త చిలుమూరులో ఇంటింటికి వెళ్లి ప్రచారం సాగించారు. ఈసారి కొత్త చిలుమూరులో మొత్తం ఓట్లు మీకు వేస్తామంటూ మహిళలు ఆయనకు హామీ ఇచ్చారు. ప్రచారం అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అన్ని విధాలుగా ప్రజలను వంచించిందని వారి అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎన్నో బాధలు పడ్డారన్నారు. ప్రభుత్వం వ్యతిరేక ఓటు చీలకుండా జగన్‌ను గద్దె దించేందుకు టీడీపీ, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జత కట్టారన్నారు. ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారని మరో 40 రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని మీ ఓటును సైకిల్ గుర్తుకే వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు షైనేని మురళీకృష్ణ, జొన్నలగడ్డ విజయబాబు, మేకా శేషుబాబు, తమ్మా శివారెడ్డి, యలవర్తి బ్రహ్మానందం, జనసేన పార్టీ మహిళా నాయకురాలు సోమరౌతు అనురాధ, మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, టీడీపీ నాయకులు సుంకర రాంబాబు, గుమ్మడి సాంబశివరావు, యలవర్తి కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, కోగంటి హరిబాబు, కాసరనేని మోహన్, నాగళ్ల కృష్ణారావు, కొడాలి నారాయణ, ధూళిపూడి కృష్ణ, స్థానిక టీడీపీ నాయకులు మొలబంటి రామారావు, మాజీ ఎంపీటీసీ మోహనరావు, అబ్రహం, శివయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీని నిలదీస్తున్న మండల కోఆప్షన్ సభ్యుడు సలీం

రసాభాసగా మండల సమావేశం

● సభ్యులకు తెలియకుండా పనులు ఎలా చేపట్టారంటూ నిలదీత

● మంత్రికి చెప్పే చేశామన్న ఎంపీపీ

భట్టిప్రోలు, మార్చి 6: భట్టిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. సమావేశాన్ని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు ఎంపీపీ డి.లలితకుమారి, అధికారుల తీరుపై వ్యతిరేకతను వ్యక్తం చేశారు. సభ్యుల మధ్య వాగ్వివాదం జరగడంతో సభలో గందరగోళం నెలకొంది. జగనన్న కాలనీలో రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన పైపులైన్లు పనికి రాకుండా పోయాయని గుత్తేదారుడి నిర్లక్ష్యం కారణంగా నాసిరకం పైపులు వాడడం వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగట్లేదని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని సలీం సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కార్యాలయం మరమ్మతుల నిమిత్తం రూ.14 లక్షల నిధులు ఖర్చు చేశారని ఎంపీటీసీలకు సమాచారం లేకుండా ఇష్టానుసారంగా తీర్మానాలు కూడా లేకుండా పనుల ఎలా చేపడతారని ఎంపీపీని ప్రశ్నించారు. మరమ్మతులతో పాటుగా కార్యాలయ ప్రాంగణంలో డ్రెయినేజి నిర్మాణం, టాయిలెట్ల ఆధునీకీకరణ పనులు చేపట్టకుండానే పనులు చేసినట్లు చూపించి ప్రారంభోత్సవం కూడా చేయడం ఏంటని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు మమ్మల్ని అడగడం కాదు మంత్రిని అడగండి మంత్రికి చెప్పే మేము పనులు చేశామని ఎంపీపీ సమాధానం తెలపడంతో మంత్రి చెబితే సరిపోతుందా సర్వసభ్య సమావేశంలో ఎజెండాలో చేర్చకుండా సభ్యులకు చెప్పకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ పనులు ఎలా చేస్తారని నిలదీశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని 27 శాఖల అధికారులకు సమాచారం చేరవేసినప్పటికి సమావేశానికి రాకపోవడంతో ఎంపీపీ లలితకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు సమస్యలను వివరిస్తుండగానే సమావేశం మధ్యలో నుంచి వైస్ ఎంపీపీ కె.పిచ్చియ్యశాస్త్రి లేచి వెళ్ళిపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, ఎంపీడీవో మల్లికార్జునరావు, ఏవో జలజ, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్ష ప్రజలకు వరం : తాండ్ర

కర్లపాలెం, మార్చి 6: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు అన్నారు. మం డలంలోని నల్లమోతువారిపాలెంలో బుధవారం నిర్వహించిన జగన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో తాండ్ర సాంబశివరావు పాల్గొని ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరించారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ గోపీనాధ్, పిల్లల వైద్యులు రవిప్రకాష్, డాక్టర్ గిరిధర్ రెడ్డి, జాషు వా, ఇస్సాక్, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బం ది, వలంటీర్లు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, మార్చి 6 : మండలపరిధిలోని పిట్టువారిపాలెం గ్రామ సచివాలయం నందు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టువారిపాలెం సర్పంచ్ ఏటి అశ్విని శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో బివి.రమణమూర్తి, ఈవోపీఆర్డీ కె.పద్మజ, పంచాయతీ కార్యదర్శి వసుంధర లక్ష్మీ, సచివాలయ కార్యదర్శి వెంకటరెడ్డి, వైద్యాధికారులు, ఆశాకార్యకర్త లు, ఎన్ఎమ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పిట్టలవానిపాలెం, మార్చి 6 : మండలంలోని అల్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం జరిగే పంటపొలాల్లో జిల్లా స్థాయి అధికారి పీడీ రాధ స్థానిక ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. బుధవారం పీడీ రాధ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మొక్కుబడిగా కాకుండా సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి వరధానమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం

రేపల్లె, మార్చి 6: గ్రామాల్లో రహదారులు అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభసభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. బుధవారం నిజాంపట్నం మండలం కొత్తపాలెం కొత్తూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రూ.13కోట్ల 80లక్షలతో సీసీ రోడ్లు రూ.6కోట్ల 30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను మోపిదేవి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులతో రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్, ఎంపీపీ మోపిదేవి నిర్మల, ఎంపీటీసీ హరనాథబాబు, సర్పంచ్ రవి, యార్లగడ్డ మదన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

చెరుకుపల్లి, మార్చి 6: నిరుద్యోగ యువత జాబ్ మేళాను ఉపయోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి విష్ణుమూర్తి అన్నారు. బుధవారం గూడవల్లిలోని టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా జరిగింది. జాబ్ మేళాలో 96మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 42 మంది అర్హత సాధించారు. యంగ్ ప్రొఫెషనల్ హారిక, సాగంధి, ఇ.తమ్మాజీరావు, డీఎన్‌డీవో ఎస్.సుధాకర్, డిస్ట్రిక్ కన్వీనర్, ప్రిన్సిపాల్ రావి శ్యామ్ ప్రసాద్, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

భట్టిప్రోలు, మార్చి 6: మండలంలోని వెల్లటూరులో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, గంగాపార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి త్రయాహ్నిక దీక్ష దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 10వ తేదీ జరగనున్నాయని కార్యనిర్వహణాధికారి దీవి వెంకటప్పలాచార్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 7న స్వామివార్లను పెండ్లి కుమారుని చేయుట, రాత్రి ధ్వజారోహణ, 8న బలిహరణ, జగజ్యోతి, ఎదురుకోలోత్సవం అనంతరం స్వామివార్ల కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహిస్తున్నామన్నారు. 9న సాయంత్రం కల్యాణమూర్తులైన స్వామివార్ల దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని కార్యనిర్వహణాధికారి వివరించారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం

వేమూరు, మార్చి 6 : మండలంలోని వరహాపురంలో బుధవారం సర్పంచ్ ఎల్ల మాటి స్వాతి అధ్యక్షతన ఆరోగ్య సురక్ష టూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, మండల వైద్యాధికారి డాక్టర్ వెంకట సురేష్, ఏఎన్ఎంలు, వైద్యశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వేమూరు, మార్చి 6: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాం గణంలోని రోశయ్య మీటింగ్ హాల్లో గురువారం మధ్యాహ్నం 3గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించడం ప్రముఖులైన మహిళలను గుర్తించి వారిని సత్కరిస్తారన్నారు.

బాపట్ల, మార్చి 6 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బాపట్ల కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలకు ఆటలు, పాట ల పోటీలు నిర్వహిస్తారన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి గాదె ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, మార్చి 6 : మండలపరిధిలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి నియోజకవర్గ వైసీపీ నాయకుడు గాదె మధుసూద నరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు గాదె మధుసూదనరెడ్డి కుటుంబసభ్యులకు ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వచనాలను అందజేశారు. ఆయన వెంట నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు, గాదె యువసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి జనసేన సాయం

వేమూరు, మార్చి 6 : మండలంలోని చావలి గ్రామానికి చెందిన సిగిరిశెట్టి యానాదిరావు పూరిల్లు గతవారం అగ్నికి ఆహుతయ్యింది. కుటుంబ సభ్యులు నిరాశ్రయులై బయటపడ్డారు. వారికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ ఆధ్వర్యంలో రూ.50వేలు ఆర్థిక సాయంతో పాటు, 75కిలోల బియ్యం అందజేశారు. పార్టీ నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, ధర్మేంద్ర, దాది సీతారామయ్య, చాపల శివయ్య, తిరుమలరావు, రమేష్ రంగా, పద్దయ్య, కలవ వెంకటసుబ్బయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



తిరునాళ్లకు రథాన్ని సిద్ధం చేస్తున్న చిత్రం



ముస్తాబైన అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవస్థానం

బాపట్లరూరల్, మార్చి 6: బాపట్ల మండలంలోని అప్పికట్ల, నాగేంద్రపురం గ్రామాల్లో మహాశివరాత్రి తిరునాళ్ళకు దేవాలయాలు ముస్తాబు చేశారు. బాపట్ల మండలం అప్పికట్లలో ప్రసిద్ధిగాంచిన గంగా, అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి రోజు స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించటం, శనివారం రథోత్సవం, ఆదివారం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. అదేవిధంగా బాపట్ల మండలం నాగేంద్రపురంలో ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను గ్రామస్థులు ఎంతో వైభవంగా ప్రతి ఏట నిర్వహిస్తున్నారు. విద్యుత్ ప్రభలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ తిరునాళ్ళను నిర్వహిస్తారు.

● అరవపల్లి(రేపల్లె), మార్చి 6: మండలంలోని అరవపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా గురువారం ఆలయం చుట్టూ పశువుల ప్రదక్షిణ, రాత్రి 7 గంటలకు గొల్లభామ పేరంటాళ్ళ అమ్మవారికి సద్ది నైవేద్యాల సమర్పణ, 12 గంటలు దాటిన తర్వాత శివరాత్రి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం, శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి స్వామివారికి పంచామృతాలతో 11 రుద్రాల అభిషేకం, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి 9 గంట లకు లింగోద్భవ కాలసందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, జరుగుతుంది. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ ఈవో పి.రాజేశ్వరావు తెలిపారు.



నిజాంపట్నం మండలానికి చెందిన వైసీపీ నాయకులను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రానున్నది టీడీపీ ప్రభుత్వమే : అనగాని

రేపల్లె, మార్చి 6: పార్టీలోకి చేరిన ప్రతి కార్యకర్త, నాయకుడికి సముచితస్థానం కల్పించి వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయం లో నిజాంపట్నం మండలానికి చెందిన బొర్రావారిపాలెం, అచ్చుతపురం, ప్రజ్ఞం గ్రామాలకు చెందిన బొర్రా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గోవర్ధన్‌ప్రసాద్, మోర్ల వెంకట్రావు, డి.ముసలయ్య, ఎస్ వెంకటేశ్వరరావు, వి.వీర్రాజు, నాయుడుప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, కె.అంకమ్మరావు, మరో 30 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు ప్రతి కార్యకర్త, నాయకులు సైనికుల్లా పనిచేస్తే ఐదు సంవత్సరాల పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత నాదేనని మీకు అండగా ఉండటంతో పాటు ఆర్థికంగా బలపడే విధంగా కృషిచేస్తానని ఎమ్మెల్యే అనగాని అన్నారు. రానున్నది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమేనని ప్రజలెవ్వరు అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు జగన్మోహన్‌రెడ్డి పాలన కుళ్ళు, కుతంత్రాలు, అరాచకాలు పెరిగిపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తప్పనిసరిగా బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాతా ఏడుకొండలు, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, అనగాని శివప్రసాద్, కేసన రామకృష్ణ, బొర్రా సురేంద్ర, వి.సాంబయ్య, కె.మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మురళీకృష్ణ, సురేష్‌బాబు, కార్యకర్తలు

గెలుపు దిశగా పని చేయండి

● ఆర్థిక ఉగ్రవాది జగన్‌కు బుద్ధి చెప్పండి

● మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, మార్చి 6 : నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు సమన్వయంతో గెలుపు దిశగా పని చేసి ఆర్థిక ఉగ్రవాది అయిన ముఖ్యమంత్రి జగన్‌కు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జనసేన టీడీపీ బలపర్చిన అభ్యర్థి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద బుధవారం రాత్రి వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పనిచేసిన వేమూరి మురళీకృష్ణ, నాదెండ్ల సురేష్‌బాబు ఆధ్వర్యంలో 150 కుటుంబాల వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనందబాబు మాట్లాడుతూ జనసేన, టీడీపీల కలయిక ద్వారా రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి జరగబోతుందని తెలిపారు. నియోజకవర్గంలో తనను గెలిపించాలని రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూడిన అధికారాన్ని చూపించాలని ఆనాడే రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలను వేధించిన వైసీపీ వారిని వదిలిపెట్టే పని లేదని హెచ్చరించారు. జగన్‌కు తలొగ్గి ప్రజలను వేధించిన ఉద్యోగులను కూడా వదిలేది లేదని హెచ్చరించారు. పార్టీలో చేరిన మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో టీడీపీలో పని చేసిన తాను వైసీపీలోకి వెళ్ళి తప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ సూచనల మేరకు భూ కుంభకోణాలు అనేకం జరిగాయని, హత్యా రాజకీయాలతో కొందరు నాయకులు పైరవీలు చేశారన్నారు. అలాంటి దుశ్చర్యలకు తనను కూడా బలిచేయాలని ఎంతో ప్రయత్నం చేశారని, అందుకు తాను దూరంగా ఉండటం వల్ల తనపై అనేక దుష్ప్రచారాలు కూడా చేశారని అన్నారు. చివరకు పార్టీలో ఇమడలేక తిరిగి టీడీపీలోకి రావడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముందుగా జంపని నుంచి వేమూరు వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ సమన్వయ కర్త ఊసా రాజేష్, టీడీపీ కొల్లూరు మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, ఘంటా స్వాతి, శరత్‌చంద్ర, కేసాని శివకృష్ణ, దొప్పలపూడి సుధాకర్, దాది సీతారామయ్య, కలవా వెంకట సుబ్బయ్యగుప్త, విష్ణుమొలకల శ్రీనివాసరావు, షేక్ హనీఫ్, ఈగ రామదాసు, గవిని లక్ష్మీదుర్గ, షేక్ జానీ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్



కరపత్రాలు అందిస్తూ పథకాల గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, మార్చి 6: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలిచి అనగాని గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. బుధవారం నిజాంపట్నం మండలంలోని కొత్తపాలెం, తాళ్ళతిప్ప, మునిరేడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకపాలన వివరిస్తూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల 9నెలల కాలంలో అవినీతి, అక్రమాల ప్రభుత్వంతో ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. తీర ప్రాంతమంతా అభివృద్ధి చేసే విధంగా ప్రజలంతా అనగానికి అండగా ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, దండుప్రోలు వెంకటేశ్వరరావు, పిచ్చియ్య రేపల్లె రామాంజనేయులు, పి.చింతారావు, వడ్డి లక్ష్మీజీ, బొమ్మిడి రామకృష్ణ, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, నల్లపాటి యల్లయ్య, పంతాని సాయికుమార్, దేవగిరి రవి, జనసేన నాయకులు రాసంశెట్టిమహేష్, దేవగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, మార్చి 6: వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు (జీఎస్) అన్నారు. చెరుకుపల్లిలో బుధవారం జరిగిన బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టబోయే పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మొహమా టం రాధాకృష్ణమూర్తి, వుయ్యూరు శివకృష్ణ, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, శొంఠి కోటయ్య, గోగినేని వసుధ, గోగినేని సీతారామయ్య, జనసేన మండల అధ్యక్ష, కార్యదర్శులు దూళ్ళ సురేష్, మొహమాటం పృథ్వీ, లక్కెంశెట్టి గోపి, వెంకట్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలతోనే బీసీలకు న్యాయం : కొక్కిలిగడ్డ

రేపల్లె, మార్చి 6: టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో విడుదల చేసిన జయహో బీసీ డిక్లరేషన్ బీసీలకు ఎంతగానో ఉపయోగపడుతుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ నాయకు లు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు నియోజకవర్గ బీసీల తరపున అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీడీపీ బీసీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, గోపిరాజు, చెన్ను నాగమల్లేశ్వరరావు, తంగెళ్ళమూడి సాయిబాబు, పంతాని సాయికుమార్, డొక్కు వెంకట్, బి.సూర్యరాజు, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు కల్పించాలి


● డ్వామా పీడీ అర్జునరావు

పర్చూరు, మార్చి 6: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా(ఎన్ఆర్ఈజీఎస్) ప్రతి కుటుంబానికి 100 రోజులు పనికల్పించాలని డ్వామా పీడీ అర్జునరావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని చిన్ననందిపాడు, అడుసుమల్లి గ్రామాల్లోని ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న పంట కుంటలు, కాలువ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించి తగుసూచనలు ఇచ్చారు. అన్నీ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు వేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ముందుగా పని కల్పించాలన్నారు. కూలీలకు మస్టర్‌ను విధిగా వేయాలన్నారు. పనుల విషయంలో ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీడీ ఎస్.రాజేస్, ఫీల్డ్అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.


పోటీలలో పాల్గొన్న కడవకుదురు ఎడ్లు

హోరాహోరీగా పోలురాదా ఎడ్ల పందాలు

చినగంజాం, మార్చి 6 : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి నాటుబండి పోలు రాదా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు కృష్ణ , నెల్లూరు జిల్లాలతో పాటు, బాపట్ల, చీరాల, వేటపాలెం, కడవకుదురు, సోపిరాల తదితర గ్రామాలకు చెందిన 17 ఎడ్ల జతలు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. సోపిరాల టైర్ల బండ్ల అసోసియేషన్, గ్రామస్థుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ నాటుబండి పోలు రాదా ఎడ్ల పందాలను మున్సిపల్‌మాజీ కమిషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో దేవస్థానం ప్రాంగణం తిరునాళ్ల వాతావరణం నెలకొంది. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు గురువారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూబీ.వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎన్‌వీజీ.మూర్తి, కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకటసుబ్బారావు, చెరుకూరి పుల్లయ్య, ఎ.రామకృష్ణ, నిర్వహణ కమిటీ సభ్యులు టి.జయరావు, చెరుకూరి భాస్కరరావు, గ్రామ పెద్దలు, గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావులు పాల్గొన్నారు.


సోలార్ సబ్సిడీ యూనిట్‌ల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

సోలార్ యూనిట్లతో గృహాలకు ఉచిత విద్యుత్

ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ

అద్దంకి, మార్చి 6: ఇళ్ల పైకప్పుపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహవినియోగానికి ఉచిత విద్యుత్ పొందవచ్చు అని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. బుధవారం విద్యుత్ కార్యాలయంలో వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా సుమారు కోటి ఇళ్ళపై సోలార్ యూనిట్‌లు సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు. 1 కేవీ యూనిట్‌కు మొత్తం రూ. 55 వేలు ఖర్చు కాగా రూ. 30 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. 2కేవి యూనిట్‌కు మొత్తం ఖర్చు లక్ష రూపాయలు కాగా రూ. 60 వేలు, 3కెవి మొత్తం రూ. 1.40లక్షలు ఖర్చు కాగా 78 వేల రూపాయలు సబ్సిడీ పొందవచ్చు అన్నారు. 3 కేవీ యూనిట్ ఏర్పాటు చేసుకున్న ఇళ్లకు నెలకు 300 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చు అన్నారు. ఇంటి వాడకానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తే యూనిట్‌కు రూ.4.17 పైసలు చొప్పున జమచేస్తామన్నారు. ఇందుకోసం నేరుగా వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. యూనిట్ నిర్మాణం పూర్తి అయిన తరువాత సబ్సిడీ మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సత్యనారాయణ, ఈఆర్‌వో కార్యాలయం జేఏవో రమేష్, టెక్నికల్ ఏఈ బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల నుంచి నమూనాల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐ శేషగిరిరావు, పక్కన స్కూల్ ప్రతినిధులు

సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగం

● డీఎస్పీ బేతపూడి ప్రసాద్

చీరాల,మార్చి 6 : విద్యార్థుల్లో నిబిడీకృతమైన మేధో సంపత్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అన్నారు. స్థానిక విజ్ఞానభారతి స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సీఐ శేషగిరిరావుతో కలిసి డీఎస్పీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రతినిధులు మేజర్ టి.రోశయ్య, మన్నేపల్లి బ్రహ్మయ్య తదితరులతో కలసి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాల ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచి ఏ విద్యార్థి దేనిపై ఆసక్తి కనబరుస్తారో గుర్తించి, అందుకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తే సత్ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, స్కూల్ డైరెక్టర్లు టి.భూపేంద్ర, జి. సుబ్బారావు, ప్రిన్సిపల్ షేక్ కరిముల్లా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందుచూపు లేకుంటే తాగునీటికి తిప్పలే..!

ఎస్ఎస్‌ట్యాంకును నింపాలి

ముందస్తు చర్యలు తీసుకోవాలి


చీరాల - కారంచేడు రోడ్డులోని మంచినీటి చెరువు

చీరాల,మార్చి 6 : చీరాల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చీరాల, కారంచేడు రోడ్డులోని సమ్మర్ స్టోరేజి ట్యాంక్ ప్రధాన వనరు. మున్సిపల్ పరిధిలో సుమారు లక్ష మంది జనాభా ఉన్నారు. సుమారు 25వేల గృహాలు ఉన్నాయి. ఒక్కో మనిషికి సగటున రోజుకు 80 లీటర్లు అవసరం. మున్సిపల్ పరిధిలో ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. 10వేల ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ క్రమంలో సమ్మర్ స్టోరేజి ట్యాంకులో ఎప్పుడూ తాగునీరు పుష్కలంగా ఉంటుంది. చెరువులో నీటి మట్టం తగ్గినపుడు అవకాశం లభించిన సమయంలో కొమ్మమూరు కాలువ నుంచి నీటిని చెరువుకు నింపుతుంటారు. ఈక్రమంలో ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే ఇబ్బంది పడతామని పురప్రజలు అంటున్నారు. ఎస్ఎస్ ట్యాంక్‌లో 24 అడుగులమేర నీటి మట్టం ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 19 అడుగుల నీటి మట్టం నిల్వఉంది. కొమ్మమూరు కాలువకు నీటి విడుదల ఆగింది. అయితే త్వరలో తాగునీటి చెరువులను నింపుకునేందుకు కొమ్మమూరు కాలువకు నీరు విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. అప్పుడు వెంటనే ఎస్.ఎస్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపాల్సిన అవసరం ఉంది. లేదంటే ఎండల తీవ్రత నేపథ్యంలో పెరిగే నీటి అవసరతకు సరిపడా సరఫరా చేయలేరు. ప్రస్తుతం రోజూ ఉదయం పూట ఒక గంట పాటు మున్సిపల్ నీటి సరఫరా జరుగుతోంది. సాధారణంగా నీటి మట్టం తగ్గి కాలువ నుంచి చెరువులకు నీటిని నింపే పరిస్థితి లేనప్పుడు, ఉన్న నీటిని రోజు మార్చి రోజు సరఫరా చేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. ఈ క్రమంలో పాలకులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో దొంగ మస్టర్లు

● మండల సర్వసభ్య సమావేశంలో నిలదీసిన అధికార పార్టీ సర్పంచ్


సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోను ప్రశ్నిస్తున్న అధికారపార్టీ సర్పంచ్

అద్దంకిటౌన్, మార్చి 6: ఉపాధి పనులు చేయనివారికి దొంగ మస్టర్లు వేసి డబ్బులు చెల్లిస్తున్నారని, దీనికంతటికి కారణం ఏపీవో అని రామాయపాలెం గ్రామ అధికారపార్టీ సర్పంచ్ రామాంజనేయరెడ్డి సమావేశంలో అధికారిని నిలదీశాడు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి వచ్చిన ఆయా శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో గాయత్రిదేవి మాట్లాడుతుండగా రామాయపాలెం సర్పంచ్ లేచి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే వారికి, అద్దంకిలో ఉండేవారికి, జీఎస్టీ కట్టేవారికి, మంచంలో ఉండేవారికి ఉపాధి పనులు చేయకుండానే వారికి మస్టర్ వేసి డబ్బులు వేస్తున్నారన్నారు. వెంటనే ఆవిషయంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనుల గ్రామ సభల విషయం సర్పంచ్‌కి తెలియజేయకుండా వారే సభలు నిర్వహించుకుంటున్నారని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణ కలుగజేసుకుని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రామ సభలు సర్పంచ్ అధ్యక్షతన జరగాలని మరో సారి అలా జరగకుండా చూడాలన్నారు. అలాగే అద్దంకి నుంచి మోదేపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు ఉదయం 6 గంటలకు వస్తుందని దాని వలన పిల్లలు తిమ్మయపాలెం పాఠశాలకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారని, బస్సు సమయాన్ని ఉదయం, సాయంత్రం వేళలలో విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా మార్పులు చేయాలని కోటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రం అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు అందరూ లేకపోవడం, వచ్చిన కొందరు ఎంపీటీసీలు సమావేశంలో కూర్చోకుండానే కిందనే అధికారుల వద్ద పుస్తకంలో సంతకాలు చేసి వెళ్ళిపోవడం సర్వ సాధారణం అయ్యింది.

పేదల కంటి వెలుగు ప్రదాత 'ఏలూరి'

టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ

ఉచిత మెగా కంటివైద్య శిబిరానికి వి శేష స్పందన


దివంగత ఎన్టీఆర్, ఏలూరి నాగేశ్వరరావు చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


కంటి వైద్య శిబిరానికి హాజరయిన ప్రజలు

మార్టూరు, మార్చి 6 : ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో బుధవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి 327 మంది హాజరు కాగా 207 మందికి శస్త్ర చికిత్సలకు వైద్యులు రిఫర్ చేశారు. ఈ క్యాంపుకు హాజరయిన వారికి రక్త, బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.తొలుత స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, మార్టూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కామేపల్లి హరిబాబులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించడంలో ఎమ్మెల్యే ఏలూరికి సాటిలేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల ఒక బాధ్యతగా నెలనెలా నిరంతరం ఎమ్మెల్యే ఏలూరి కంటి వైద్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారన్నారు. మచ్చలేని నాయకుడిగా,సేవే పరమావధిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి వెలుగు ప్రదాతగా ఏలూరి నిలిచాడన్నారు. 15 ఏళ్ళుగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ లక్ష మందికి కంటి వైద్య శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు అడుసుమల్లి శ్రీనివాసరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు షేక్ ఫారూక్, మార్టూరు మండల ఉపాధ్యక్షుడు దిరిశాల రామకృష్ణ, యద్దనపూడి మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఈదల అనిల్, నాయకులు కృష్ణయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

\- ఎమ్మెల్యే బలరాం


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల,మార్చి 6 : చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. దీంతో పాటు ఐదేళ్ల కాలంలో రూ.3.55 కోట్లు వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ నియోజకవర్గంలో 2019 ముందు, తరువాత నెలకొన్న పరిణామాలను వివరించారు. రాజకీయంగా వేసిన అడుగులు పరిస్థితులు, పరిణామాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, పీఆర్ డీఈ శేషయ్య, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాళరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి


ఇంకొల్లులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

ఇంకొల్లు,మార్చి 6: వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపొందితే బీసీల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మంగళవారం మంగళగిరిలో జరిగిన జయహో బీసీల బహిరంగసభలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ప్రకటించడం పట్ల స్థానిక బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. . బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ నేతలు సమావేశమయ్యారు. బీసీల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ కృషి చేసిందన్నారు. ఈ సమావేశంలో బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు వలేరు మార్కు, ఇంకొల్లు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వెంకట్రావు, కొలిమర్ల వసంతరావు, మల్లం శ్రీనివాసరావు, షేక్ మీరావలి, బట్టు శ్రీనివాసరావు, మోహనరావు, గుంజి గోపి, కాంతారావు, జరుబుల శ్రీనివాసరావు,సాంబయ్య, వెంకటేశ్వర్లు, శివయ్య, సతీష్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదికి ఘన సన్మానం


న్యాయవాది వైవీఆర్‌ను సన్మానిస్తున్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు

పర్చూరు, మార్చి 6: పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో సీనియర్ న్యాయవాది యార్లగడ్డ వెంకటేశ్వరరావు(వైవీరావు)ను బుధవారం పర్చూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనసన్మానం నిర్వహించారు. న్యాయవాద వృత్తిని చేపట్టి 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బార్‌అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా నరేంద్రకుమార్ నేతృత్వంలో సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది వృత్తిలో వైవీరావు సేవలను కొనియాడారు. ఈసందర్భంగా వైవీరావు రూ.40 వేల నగదును బార్‌అసోషియేషన్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రావి శ్రీనివాసరావు, న్యాయవాదులు రావి సత్యన్నారాయణ, చాగంటి సుబ్బారావు, పోతిని సురేంద్ర, రావి రమేష్ బాబు, మేకల రవీంద్రనాద్‌రెడ్డి, వెంగళశెట్టి తిరుమలరావు, మండవ వీరాంజనేయులు, కట్టా సాల్మన్, దగ్గుబాటి రాఘవయ్య, తులసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

పర్చూరు, మార్చి 6: తెలుగుదేశం, జనసేన పార్టీల సారధ్యంలో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న చట్టాల మాదిరిగానే బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం చారిత్రకమన్నారు. బడుగు బలహీన వర్గాలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4వేల చొప్పున పెన్షన్ ఇస్తామనటం శుభపరిణామం అన్నారు.

375 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, మార్చి 6 : మండలంలోని కడవకుదురు మండల ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కే.కీర్తిస రోజ్, బి.నాగేంద్రులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కంటి వైద్యులు డాక్టర్ సుధాకర్ పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎన్‌వీ.గోపాలకృష్ణమూర్తి, గ్రామ సర్పంచ్ జి.శివకుమారి, గ్రామ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, హెచ్‌వీ.వరదానం, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన

స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా రెండు లక్షల రూపాయిల నిధులతో నిర్మించిన రెండు మరుగుదొడ్లను బుధవారం యూబీఐ చీఫ్ మేనేజర్, ఆర్ఎల్‌పీ హెడ్ ఆర్.అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు

దారి కోసం ధర్నా

మేదరమెట్ల, మార్చి 6: ఇంటి దారి విషయంలో తమకు న్యాయం చేయాలని హైదరాబాద్‌లోని నేషనల్ ఎస్సీ కమిషన్ కార్యాలయం ఎదుట బుధవారం సుధారాణి ధర్నా చేసింది. మండలంలోని బొడ్డువానిపాలెంకు చెందిన గొట్టిపాటి సుధారాణి తమ ఇంటి దారి విషయమై న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు గతంలో వివిధ స్థాయిలలోని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై జిల్లా స్థాయి అధికారులు బొడ్డువానిపాలెం వచ్చి ఇరువర్గాలకు చెందిన వారి పత్రాలను పరిశీలించారు. ఈ విషయంపై ఇప్పటికే ఇరువురూ కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఆమె హైదరాబాద్‌లో న్యాయం చేయాలని ధర్నా చేపట్టింది.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొన్న డీటీ వాసుదేవరావు

బల్లికురవ. మార్చి 6 : పేదల నుంచి కొనుగోలు చేసిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున కొప్పెరపాడు సమీపంలో అద్దంకి ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ వాసుదేవరావు పట్టుకొన్నారు. గొర్రెపాడు రోడ్డు నుంచి అద్దంకి నార్కెట్‌పల్లి రోడ్డుకు ఏపీ 39 టీటీ 2125 గల నాలుగు చక్రాల వాహనంలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు సమాచారం అందింది. ఆమేరకు తనిఖీలు నిర్వహించగా వాహనంలో 90 బస్తాల బియ్యం ఉండటంతో వెంటనే డ్రైవర్ కె. రమేష్‌ను ను ఆదుపులోకి తీసుకొని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని గుంటుపల్లి డీలర్‌కు అప్పగించినట్లు డీటీ తెలిపారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికార్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం తరలిస్తున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ నాగ శివారెడ్డి తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

చీరాలటౌన్, మార్చి 6 : మైనర్‌లు పట్టణంలో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కూడా చర్యలుంటాయన్నారు. పెరిగిన రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే సహకారంతో కుట్టు మిషన్లు అందజేత


పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న అసోయేషన్ సభ్యులు

అద్దంకి, మార్చి 6: అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవి కుమార్ సహకారంతో పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేసినట్లు అద్దంకి టౌన్, మండల టైలర్స్ సంఘం అధ్యక్షుడు గోరంట్ల అచ్చయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం అసోసియేషన్ సభ్యులు 8 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ మదీనా, ట్రెజరర్ నాగేశ్వరరావు, ఆంజనేయులు, కరిముల్లా, ముస్తాఫ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చినగంజాం, మార్చి 6 : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2023-24 విద్యా సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో బి.అజయ్‌బాబు, కోటేశ్వరావులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోపిరాల గ్రామానికి చెందిన పోలకం నరసింహారావు రూ.25,000ల విలువ గల ప్రింటర్‌ని పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపకారవేతనం, ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులు


ప్రశంసాపత్రాలతో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

పంగులూరు, మార్చి 6 : గత ఏడాది పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన దీనదయాల్ స్పర్శ యోజన ఉపకారవేతన పోటీ పరీక్షలో ప్రతిభచాటిన విద్యార్థులకు ఆ శాఖ అధికారులు ఉపకారవేతనం, ప్రశంసాపత్రాలు అందజేశారు. 2023 అక్టోబర్‌లో జరిగిన ఈ పోటీ పరీక్షలో కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించారు. ఈ విద్యార్థులకు బుధవారం అద్దంకి ఐపీవో విష్ణు రూ. 6 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఐ.అణిత, స్థానిక పోస్టల్ అధికారి తిరుమలరావు, పీసీ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పటిష్టంగా పనిచేయాలి


బూత్ కమిటీ ప్రతినిధులతో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

చీరాల,మార్చి 6 :బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పటిష్టంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. పేరాల టీవీవీ ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం రాత్రి జరిగిన బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, నీలం శామ్యూల్ మోజెస్, సయ్యద్ అలీమ్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

బోడవాడ(పర్చూరు) మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా పర్చూరు మండలంలోని బోడవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కోడూరి శేషబ్రహ్మాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామయ్యకు ఎమ్మెల్యే గొట్టిపాటి నివాళి


కశ్యాపురంలో కావూరి రామయ్య చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

పంగులూరు, మార్చి 6: ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ బుధవారం కశ్యాపురంగ్రామంలో పర్యటించారు. గ్రామంలో కావూరి రామయ్య నిర్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లగుండ్ల కోటేశ్వరరావు, ప్రసన్న పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

బల్లికురవ. మార్చి 6 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని వేమవరం, చెన్నుపల్లి తదితర గ్రామాలను డీఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా అయన పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలకు సిబ్బంది ప్రతి రోజూ వెళ్లాలని, ప్రజల కదలికలను గమనించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.అలానే అల్లర్లను ప్రోత్సహించే వారిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎవరైన చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలానే ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరంను ప్రతి రోజూ సందర్శించాలన్నారు. ఈ పరిశీలనలో సీఐ నరసింహారావు, ఎస్ఐ నాగశివారెడ్డి తదితరులు ఉన్నారు.